క్లుప్తంగా

నేడు నున్నలో జగనన్న ఆరోగ్య సురక్ష

నున్న(విజయవాడరూరల్): వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నున్న గ్రామం మూడవ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యనమలకుదురులో పవిత్రోత్సవాలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు గురువారం శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారికి, ఆలయ ప్రాంగణంలో ఉన్న దేవతలకు అభిషేకం చేశారు. మండపారాధన, అఖండస్థాన, దీక్షాధారణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ గంగాధరరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి జగనన్న కృషి



కంకిపాడు: విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డీసీఎంఎస్, రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రక్ష ఫౌండేషన్ ద్వారా అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. స్నిగ్ధ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధి, పాఠశాలల్లో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

గన్నవరం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇంత మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో క్రిస్టియన్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు పొలిమేర పేతురు, పార్టీ నాయకులు తిరివీధి రంగారావు, కురాటి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గన్నవరం మండలం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఆయుర్వేద వైద్యానికి జీవం



కోలవెన్నులోని ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్

- ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో అందుతున్న సేవలు
- నేషనల్ ఆయుష్ మిషన్ నిధులతో అభివృద్ధి
- దాతల సాయంతో మరిన్ని వసతులు
- కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రికి పెరుగుతున్న రోగులు

కంకిపాడు: ఆయుర్వేద వైద్యం మరింత జవసత్వాలు పుంజుకుంటోంది. ఆయుర్వేద ఆస్పత్రిని ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ సెంటరుగా అప్‌గ్రేడ్ చేయడంతో వైద్యం మెరుగుపడింది. దీనికి తోడు కునారిల్లుతున్న ఆస్పత్రి ఆధునికీకరణకు నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దాతల భాగస్వామ్యం కూడా తోడు కావడంతో వసతులు సమృద్ధిగా సమకూరాయి. ఫలితంగా కోలవెన్ను గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం మరింత సమర్థంగా అందుతోంది. వివరాల్లోకి వెళితే...

కోలవెన్ను ప్రధాన గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఉంది. ఆయుర్వేద వైద్యం మెరుగ్గా అందించేందుకు ఆయుష్ శాఖ జిల్లాలో తొలుత కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రిని హెల్త్, స్పెషల్ వెల్‌నెస్ పంచకర్మ సెంటరుగా గతేడాది ఆగస్టులో అప్‌గ్రేడ్ చేసింది. అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. ఇందులో పంచకర్మ థెరపిస్టులు, యోగా శిక్షకులు ఇద్దరు, గార్డెనర్ ఒకరిని నియమించారు. పంచకర్మ, వెల్‌నెస్ సెంటరులో వైద్యం అందించేందుకు ద్రోణి, శిరోధార పాత్ర, స్టీమ్ బాత్ యూనిట్, కటి, జాను, గ్రీవవస్తికి సంబంధించిన పరికరాలను ఆస్పత్రికి సరఫరా చేశారు. గతంలో రోజుకు 10 నుంచి 20 మందికి కూడా అందని వైద్య సేవలు ప్రస్తుతం 100కు పైగా అందుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నలుమూలల నుంచి రోగులు, ముఖ్యంగా పక్షవాతం, కాలి ఉబ్బు నరాలు, పుండ్లు, తదితర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన రోగులు వైద్యం కోసం ఇక్కడికి వస్తున్నారు.



ఆస్పత్రిలో అందిస్తున్న పంచకర్మ సేవలు

అభివృద్ధి సొబగులు..

మెరుగైన వైద్య సేవలకు తోడు ఆస్పత్రి అభివృద్ధి సొబగులు అద్దుకుంది. నేషనల్ ఆయుష్ మిషన్ నుంచి ఆస్పత్రి భవనం మరమ్మతులు, రంగులు, ఫ్లోరింగ్, మెరక పనులు, టాయిలెట్స్ నిర్మాణం, వాహనాల షెడ్, ప్రహరీలకు రూ. 8.80 లక్షలు నిధులు కేటాయించింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పూర్తికావడంతో ఆస్పత్రి ఆధునీకరణ సంతరించుకుంది. యోగాలోని ముఖ్యమైన ఆసనాలతో కూడిన చిత్రాలను ప్రహరీలపై అందంగా అద్దారు. ఆయుష్ మిషన్‌కు తోడు దాతల భాగస్వామ్యం కూడా తోడైంది. దాతల ద్వారా రూ.4.50 లక్షలు సమకూరగా, వైద్యాధికారి పి.నీలిమ తన సొంతంగా రూ.1.30 లక్షలు వెచ్చించి ఆసుపత్రికి అవసరమైన వసతుల కల్పన పనులను పూర్తి చేయడానికి కృషి చేశారు.

వసతులు మెరుగుపడ్డాయి..



ఆయుష్ మిషన్ నిధులు, దాతల సాయంతో ఆస్పత్రిలో వసతులు మెరుగుపడ్డాయి. వైద్య సేవలకు సామగ్రి ఉంది. మందుల కొరత కూడా లేదు. సాధారణ రోగులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి. అరుదైన వృక్షజాతులతో గార్డెన్‌ను ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే గార్డెన్ పనులు పూర్తి చేస్తాం.

– డాక్టర్ పి.నీలిమ, వైద్యాధికారి, కోలవెన్ను

హెర్బల్ గార్డెన్‌కు నిధులు..

ఆస్పత్రి అభివృద్ధితో పాటు అరుదైన వృక్షజాతులను పెంచి, వాటిని సంరక్షించేందుకు రూ.2.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో అవసరమైన గార్డెన్‌ను సంరక్షించే పనిలో వైద్య సిబ్బంది నిమగ్నమయ్యారు.

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో ఉయ్యూరు పట్టణ, మండలంలోని 11 గ్రామాల వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం జరిగింది. మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు సమాజంలో సముచిత గుర్తింపునిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కలగడం అదృష్టమన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడంలో ప్రథమపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను సీఎం జగనన్న గుర్తించి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి సత్కరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్‌చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, ఎంపీపీ చీలి కల్పన, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండలం అధ్యక్షుడు దాసే రవి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర ప్రశంసనీయం

గన్నవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర ప్రశంసనీయమని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయిలో వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లనపల్లి వలంటీర్లు కే దివ్య, పీ సంధ్యారాణికి సేవావజ్ర, మరో ఐదుగురికి సేవారత్న, 435 మందికి సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం ఎంపీపీ రవి మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ, అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల్లో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వీరి సేవలకు గుర్తుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవా వజ్ర, రత్న, మిత్ర పురస్కారాలతో ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, డొక్కు వెంకన్నబాబు, సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, కొలుసు శిరీష, గోగులమూడి విజయలక్ష్మి, బడుగు బాలమ్మ, గణపవరపు శాంతి, ఎంపీడీఓ సత్యకుమార్, ఈఓపీఆర్డీ పీ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి జోగి రమేష్



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రవి, ఇతర ప్రజాప్రతినిధులు

భక్తులకు అసౌకర్యం కలిగిస్తే సహించను

ఉయ్యూరు: భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో నిర్వహిస్తున్న వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తుల సౌకర్యార్థం తాగునీటి పంపిణీని గురువారం ప్రారంభించారు. గండిగుంట సర్పంచ్ గెత్తం అనుపమ, పార్టీ నాయకుడు గెత్తం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ పంపిణీ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా కేంద్రాలను మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. తిరునాళ్లలో కల్పించిన వసతులపై ఆరా తీశారు. సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, నాయకులు పినమాల నాగకుమార్, ఎంపీటీసీ సభ్యుడు బందెల శ్రీనివాసరావు, ఎంజే రవి, పల్లె అశోక్, దిరిశం ఇందిరాప్రియదర్శిని, పాలడుగు శివజ్యోతి పాల్గొన్నారు.



తిరునాళ్లలో తాగునీటి పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

రైతుల అభ్యున్నతికి కేడీసీసీ బ్యాంకు తోడ్పాటు


రామవరప్పాడు: రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ వారి అభ్యున్నతికి కేడీసీసీ బ్యాంకు తోడ్పాటు అందిస్తుందని ఆ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు హైస్కూల్ రోడ్డులో మూడు కోట్ల రూపాయలతో నిర్మించనున్న నూతన బ్రాంచ్‌కు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు రైతుల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోందన్నారు. అతి తక్కువ వడ్డీలకే రైతులకు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేస్తూ జాతీయ బ్యాంకులకు పోటీగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామంలో నిర్మించనున్న నూతన బ్రాంచ్‌ను అతి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ. 70 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు కొమ్మినేని రవిశంకర్, గుమ్మడపు రవీంద్రరాణా, పెదవెంకయ్య, పడమట సుజాత, బ్యాంకు సీఈఓ శ్యామ్‌మనోహర్, ఏజీఎం దేవేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవి, రామవరప్పాడు సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ రామరాజు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న పద్మావతి తదితరులు

కానూరులో రొమ్ము స్క్రీనింగ్ పరీక్షలు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం రొమ్ము స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం, రోటరీ క్లబ్ సహకారంతో లైఫ్ షేర్‌బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన కాలేజీలో మహిళా ఉద్యోగులకు రొమ్ము స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ నేడు ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని అన్నారు. మహిళల్లో అవగాహన పెంచడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఏర్పాటు చేశామని తెలిపారు. రొమ్ములో కొవ్వు గడ్డలు, పాల గడ్డలు, కణితలు, టిష్యూ సమస్యలు ఉంటే పరీక్షల్లో వెల్లడవుతుందని పేర్కొన్నారు. అనంతరం 50 మంది ఉద్యోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శశి కుమార్, ప్రభుకల్యాణ్ పాల్గొన్నారు.



స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు వలంటీర్లకు అభినందన సభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వలంటీర్లకు అభినందన సభ, వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ తెలిపారు. స్థానిక నూజివీడురోడ్డులోని దయాల జక్కయ్యగారి ఆవరణలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

రేపు వలంటీర్లకు వందనం

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో శనివారం గ్రామ వలంటీర్లకు ప్రశంస, వైఎస్సార్ ఆసరా నగదు విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పాల్గొంటారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విజయవాడరూరల్: నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పి.జాహ్నవి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలను ఆమె పరిశీలించారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, దివ్యాంగులకు ర్యాంప్ నిర్మాణాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల గోడలపై రాజకీయ పార్టీల గుర్తులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్‌తో పాటు మండల సర్వేయర్ రమేష్, ఆయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

వైభవంగా జీవధ్వజ పునఃప్రతిష్ట

ఉంగుటూరు: పొణుకుమాడులో శ్రీగంగాపార్వతీ సమేత రాజేశ్వరస్వామి దేవస్థానంలో జీవధ్వజ పునఃప్రతిష్ట మహోత్సవం మొదటి రోజు గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో జీవధ్వజ, ద్వారపాలక, కాలభైరవ, బలిపీఠ ప్రతిష్ఠలు ఈ నెల 24 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు గోపూజ, శాలాంగబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యస్థాపన, మార్జనలు, దీక్షాధారణ, అఖండస్థాపన, త్రిశూల పూజ, నీరాజన మంత్ర పుష్పములు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, తదంగ హోమాలు, ధ్వజారోహణ, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. కీసరగుట్ట శ్రీవెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం శైవాగమ అధ్యాపకులు ఆగమిక బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతిశర్మ, పాలపర్తి ప్రేమ్‌చందుశర్మ విశేష పూజాలు చేశారు. త్రయాహ్నిక దీక్షతో సుంకర రాజేంద్రప్రసాద్, పద్మజ, సుంకర రవి, శ్రీదేవి, సుంకర రాజేష్, పద్మావతి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



జీవధ్వజ పునఃప్రతిష్ట పూజలు చేస్తున్న దంపతులు

26 నుంచి సాఫ్ట్‌వేర్ డెవలపర్ శిక్షణ ప్రారంభం

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో ఈ నెల 26వ తేది నుంచి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ శిక్షణకు అర్హులుగా పేర్కొన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానికంగా ఉండే పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు శిక్షణ కోసం 9494005725 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పెళ్లి కూతురు అలంకరణలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని పెళ్లి కూతురుగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరాశరం రామకృష్ణాచార్యులు పర్యవేక్షణలో పలువురు దంపతులతో మహాశాంతి హోమం జరిపారు. సాయంత్రం గత నలభై రోజులుగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ మాతృ మండలి సభ్యులచే జరుగుతున్న మండల దీక్ష ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలతో లక్ష కుంకుమార్చన, కలశ ఉద్వాసన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఎన్నటికీ మరువలేము



పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నటికీ మరువలేమని ఇంటి యజమానురాలిగా మారిన యనమలకుదురు నివాసి చందలూరి ఉషారాణి, హనుమంతరావు దంపతులు తెలిపారు. లబ్ధిదారులు నిర్మించుకున్న ఇంటికి గురువారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ గత 40 ఏళ్ల జీవితంలో సొంతింటి కల నెరవేరిందన్నారు. సీఎం జగనన్న తమ కలను సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఈడే గోపాలకృష్ణ, బండికట్ల సతీష్, ముస్తాఫా, లతీఫ్, ఫణి, మేడూరి ప్రసాద్, కోడూరి బ్రహ్మం పాల్గొన్నారు.

ధనేకుల కాలేజీలో పరిశోధన కేంద్రం ప్రారంభం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో జేఎన్‌టీయుకే ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రాన్ని ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీపై దృష్టి సారించాలన్నారు. బిజినెస్ ఇంక్యుబేటర్, డ్రోన్స్ రీసెర్చ్ లేబరేటరీతో పాటు పలు పరిశోధనలకు అనుసంధానమై సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ 32 అత్యాధునిక హైస్పీడ్ కంప్యూటర్స్‌తో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ సత్యప్రసాద్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కోనేరు సౌమ్య, అకడమిక్ డీన్ ఎ.సుధీర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

పెనమలూరు: కుమారుడు అదృశ్యం అవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మసీదు రోడ్డుకు చెందిన సీహెచ్ గంగాభవాని కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమారుడు నాగసుబ్రహ్మణ్యం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కాగా అతని మిత్రుడు చెల్లబోయిన దుర్గాప్రసాద్‌ను గత కొద్ది రోజుల క్రితం కానూరులోని ఇంటికి తీసుకువచ్చాడు. తన మిత్రుడు కొద్ది రోజులు ఇంట్లోనే ఉంటాడని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పది రోజుల తర్వాత తన మిత్రుడితో కలిసి మధురానగర్‌లో ఉంటానని సుబ్రహ్మణ్యం వెళ్లాడు. అయితే సుబ్రహ్మణ్యం తిరిగి కానూరుకు రాకపోవడంతో తల్లి గంగాభవాని మిత్రుడి చిన్నమ్మ లావణ్యకు ఫోన్ చేసి అడుగగా తమకు తెలియదని ఆమె చెప్పింది. దీంతో తన కుమారుడు కనబడటం లేదని గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి వలంటీర్ చేయూత

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన వలంటీర్ కోటిబాబు పేద కుటుంబానికి తన వంతు చేయూత అందించి సేవా భావాన్ని చాటారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా గురువారం సేవారత్న పురస్కారం అందుకున్న కోటిబాబు ప్రభుత్వం తనకు ఇచ్చిన నగదు పురస్కారంలో మూడు వేల రూపాయలను ఇటీవల మరణించిన శివాలయ అర్చకుడు సుబ్బారావు కుటుంబ సభ్యులకు అందించారు. కోటిబాబు చూపిన మానవత్వాన్ని తోటి వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీకాంత్, మెరుగుమాల శ్రీకాంత్ అభినందించారు.

రైతులకు ధాన్యం బకాయి విడుదల చేయాలి

పెనమలూరు: రైతులకు బకాయిగా ఉన్న ధాన్యం సొమ్ము వెంటనే విడుదల చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. కానూరు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేసి ప్రసంగించారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి దాదాపు 40 రోజులు అవుతున్నా సొమ్ము రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు గొరిసెట్టి నాగేశ్వరరావు, పంచకర్ల రంగారావు, కే శివనాగేంద్ర, లక్ష్మణస్వామి, నారాయణరావు, ఏసుదాసు పాల్గొన్నారు.